లలితమాత ఆలయ వార్షికోత్సవం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులోని శ్రీలలితమాతా ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నంబి వేణుగోపాలాచార్య, కౌశిక తిగుళ్లవిష్ణుశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చెల్లం స్వరూప పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా॥)	సహర్ మంగళవారం (ఉ॥)
కరీంనగర్ :	6.27	5.07
పెద్దపల్లి :	6.32	5.02
సిరిసిల్ల :	6.27	5.11
జగిత్యాల :	6.32	5.00

న్యూస్‌రీల్

ఏప్రిల్ వరకు సాగునీరందించండి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరిన రైతులు



తుంగూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: యాసంగిలో సాగు చేసిన పంటలకు ఏప్రిల్ చివరి వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. బీర్‌పూర్ మండలం తుంగూర్, బీర్‌పూర్ గ్రామాల్లో జీవన్‌రెడ్డి పర్యటించగా.. రైతులు ఆయనతో మొరపెట్టుకున్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి మొన్నటి వరకు చివరి భూములకు చేరిందని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద మరో రెండు తడులు నీరు అందుతుందని, అయితే ఏప్రిల్ చివరి వరకు నీరు అందించేలా చూస్తే పంటలు ఎండకుండా ఉంటాయని పేర్కొన్నారు. స్పందించిన జీవన్‌రెడ్డి విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడిసె జితేందర్ ఉన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

- డీఈవో రాము

జగిత్యాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిమిత్తం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు డీఈవో రాము తెలిపారు. విద్యార్థులకు ఏదైనా సమాచారం కావాలంటే కంట్రోల్ రూం నంబరు 94947 80085లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. విషయ సందేహాల నివృత్తి కోసం ఫోన్‌ఇన్ చేపట్టామని, సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌కు సంబంధించిన నంబర్లు ఇప్పటికే పంపించామని వివరించారు.

స్వయం ఉపాధికి సబ్‌ప్లాన్ నిధులు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

పెగడపల్లి: దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను స్వయం ఉపాధి పథకాలు, సంక్షేమ పథకాలకు అందించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలో జిల్లా అధ్యక్షుడు మణుగూరు హనుమంతు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీలకే కేటాయించాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దళితబంధు కింద గత ప్రభుత్వం రూ.10లక్షలు ఇస్తే.. అంబేడ్కర్ అభయ హస్తం కింద రూ.12లక్షలు ఇస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎస్సీల జనాభాకు అనుగుణంగా 20శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా.. 16 శాతం కేటాయించారని అన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, శనిగరపు ప్రవీణ్, రామిల్ల రాంబాబు, మంథని రాజు, ఇరుగురాల శ్రీనివాస్, గంగనర్సయ్య, మంతెన స్వామి, సుంకె ప్రకాశ్, ఆత్మకూరు రాజేశ్, బొమ్మల స్వామి, కుంటాల లచ్చయ్య, కొత్తూరు నర్సయ్య, మల్లారపు నర్సయ్య పాల్గొన్నారు.

ధ్యానంతో ఉన్నత స్థితికి



మాట్లాడుతున్న హరికృష్ణ

కోరుట్ల: ధ్యానంతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని రామచంద్ర మిషన్ యోగా ట్రైనర్ హరికృష్ణ అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో మూడు రోజుల ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ధ్యానంతో ఆధ్యాత్మికత, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి రాజు, కేఎల్ఎన్.కృష్ణ, పడిగెల శ్రీనివాస్, మంచాల జగన్, మంచాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

- చెరువులు, కుంటల్లో తగ్గిన భూగర్భజలం
- ఉన్న నీరు పూర్తిగా కలుషితమయం
- అనారోగ్యం బారిన పడుతున్న జనాలు
- ఎక్కడ చూసినా పైప్‌లైన్ లీకేజీలే..



ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని ప్రజలకు తాగునీరు అందించే ధర్మసముద్రం. మిషన్ భగీరథ నీరు రాకుంటే ఈ చెరువు నుంచి సరఫరా చేస్తారు. ఈ చెరువు నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వస్తోంది. వేసవి మొదలుకావడం.. ఎండలు మండడంతో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోతే పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. మిషన్ భగీరథ నీరు చాలా తక్కువగా వస్తున్నాయి. దీంతో ప్రజలకు వేసవి గట్టెక్కుతుందా..? లేదా..? అన్న సంశయం నెలకొంది.

జగిత్యాల: వేసవికాలం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. అప్పుడే మున్సిపాలిటీల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం నుంచి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. భగీరథ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈ గ్రామం నుంచే అన్ని మున్సిపాలిటీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఫిల్టర్‌బెడ్స్‌కు కూడా అనుసంధానం చేశారు. జగిత్యాలలో ఎస్సారెస్పీ నీటితో నిండి ఉండే ధర్మసముద్రం పక్కన ఫిల్టర్‌బెడ్ ఉంటుంది. మిషన్ భగీరథ నీరు రాకున్నా ధర్మసముద్రంలోని నీటిని పంప్ చేసి ప్రజలకు సరఫరా చేస్తారు. కానీ కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు మాత్రం మిషన్ భగీరథ నీరే ఆధారం. ఇప్పటికే మిషన్ భగీరథ సక్రమంగా రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా పలు కాలనీలకు సరఫరా చేస్తున్నారు. ప్రజలు ముందుగానే డ్రమ్ముల ద్వారా నింపుకుంటూ వేసవిని వెళ్లదీసే ప్రయత్నం చేస్తున్నారు.

అంతా కలుషితమే

మున్సిపాలిటీల్లో ప్రతిచోటా రంగుమారిన నీరే వస్తోంది. చాలాచోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోవడంతో బురదమయంగా మారి నీరు రంగుమారుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు లీకేజీలను అరికడితే తప్ప ప్రజలు కలుషిత నీరే తాగాల్సి వస్తోంది. ఫిల్టర్‌బెడ్‌లో ఫిల్టర్ అయినప్పటికీ ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే మున్సిపాలిటీల్లో సాధారణ పైపులు కూడా లీకేజీ కావడంతో కలుషిత నీరే వస్తోంది. జగిత్యాలలో సాధారణ పైప్‌లైన్లే చాలా ఉన్నాయి. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కలుషితం కావడమే కాకుండా ఒకరకమైన వాసన రావడంతో ప్రజలు నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



● ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని ఫిల్టర్‌బెడ్ వద్దనున్న జనరేటర్. అది చెడిపోయి చాలా రోజులు అవుతోంది. ఇప్పుడు విద్యుత్ ఉంటోంది కాబట్టి ఎలాంటి సమస్యా లేదు. ఒక వేళ కరెంట్ పోతే ఫిల్టర్‌బెడ్ పూర్తిగా ఆగిపోతుంది. నీటి సరఫరా నిలిచిపోయే అవకాశాలున్నాయి. జనరేటర్‌ను ముందే మరమ్మతు చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



● ఈ చిత్రం ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం నుంచి వచ్చే మిషన్ భగీరథ నీరు. నేరుగా జగిత్యాలలోని ఫిల్టర్‌బెడ్‌కు అనుసంధానం చేశారు. గతంలో ప్రెషర్‌తో వచ్చే ఈ మిషన్ భగీరథ నీరు ఇప్పుడు కొద్దికొద్దిగానే వస్తోంది.



● ఇది కోరుట్లలోని పలు ప్రాంతాలకు సరఫరా అవుతున్న నీరు. పూర్తిగా ఆయిల్ కలర్‌లో వస్తున్నాయి. తాగాలంటేనే ప్రజలు జంకుతున్నారు. నీరు ఇంత కలుషితం అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.



● ఇది జిల్లా కేంద్రంలోని సుతారిపేటలో సరఫరా అవుతున్న నీరు. పూర్తిగా రంగుమారి వస్తున్నాయి. ఈ నీటిని తాగలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రాంతంలో చూసినా లీకేజీలే.



● ఇది ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం నుంచి మెట్‌పల్లికి వస్తున్న నీరు. నెలరోజులుగా పూర్తిగా రంగు మారి వస్తున్నాయి. ఈ నీటిని తాగేందుకు ప్రజలు జంకుతున్నారు. అంతటా లీకేజీలు ఉండటంతో నీరంతా బురదమయంగా వస్తోంది. ఫలితంగా ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారు.



● ఇది ధర్మపురి మున్సిపాలిటీలో ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతున్న నీరు. బోర్‌వెల్స్ చెడిపోవడం, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో పట్టణప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. వేసవి ముదిరితే అనేక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.



● ఇది కోరుట్ల ప్రాంతంలోని పలు కాలనీల్లో ట్యాంకర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. వేసవికాలం ముదరక ముందే కాలనీవాసులకు నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్ల ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని మున్సిపల్ ట్యాంకర్ ద్వారా వచ్చిన నీటిని నింపుకుంటున్నారు.

నీరు పచ్చరంగులో వస్తున్నాయి



కోరుట్లలో నీరంతా కలుషితం అవుతోంది. ప్రతి కాలనీలో నల్లా నీరు పచ్చరంగులో వస్తున్నాయి. వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని కొనుక్కుంటున్నాం. అధికారులు స్పందించి నీరు కలుషితం కాకుండా చూడాలి.

– ఫసియోద్దీన్, కోరుట్ల

నల్లా ఉన్నా.. సరఫరా లేదు



రెండేళ్ల క్రితం నల్లా కనెక్షన్ ఇచ్చారు. కానీ ఇంత వరకు నీటి సరఫరా లేదు. వేసవిలో బోర్లు ఎండిపోతే తీవ్ర ఇబ్బందులు ఉంటాయి. అధికారులు స్పందించి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

– భీంరావు, మెట్‌పల్లి

నీరంతా కలుషితం



నీరు రంగుమారాయి. అవి తాగితే రోగాల పాలే. బయట కొనుగోలు చేసుకుంటున్నాం. ఇంత లీకేజీలు అవుతున్నా అధికారులు మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు స్పందించి మంచినీటిని సరఫరా చేయాలి.

– కిశోర్, విద్యానగర్, జగిత్యాల

మహిళలను కోటీశ్వరులను చేస్తాం



మహిళలను సన్మానిస్తున్న విప్, ఎమ్మెల్యే

జగిత్యాల: మహిళల హక్కులను కాపాడుతూ వారి సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వారిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళల మెరుగైన జీవన ప్రమాణాల కోసం రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.10 లక్షల వరకు ప్రమాదబీమా, వ్యాపారవేత్తలుగా మలిచేందుకు సోలార్ పవర్‌ప్లాంట్లు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌లో 5శాతం పెట్రోల్ బంక్‌లు ఇచ్చామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు కుటుంబం, సమాజపరంగా గౌరవం సాధిస్తూ పిల్లలను భావితరాలకు ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. అనంతరం ప్రతిభ కబనర్చిన వారికి ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందిస్తామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. లబ్ధిదారులెవరూ దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. అర్హులకు పథకాలు అందకుంటే ఎంపీడీవో, తహసీల్దార్ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని 88 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పంట రుణమాఫీ పూర్తి చేశామని, అందని వారి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, విండో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు భాస్కర్, తిరుపతి, కిషన్, రవినాయక్, అంజయ్య, మల్లారెడ్డి, అనిల్‌గౌడ్, సత్తిరెడ్డి, సురేశ్, మల్లారెడ్డి, కృష్ణహరి, వెంకట్‌రావు, రామ్‌రెడ్డి, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్: గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో రూ.3.25 కోట్లతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. పట్టణంలో లైబ్రరీ మంజూరు చేశామని, త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. అనంతరం అల్లీపూర్‌లో రూ.ఆరు లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. డీఈఓ రాము, సింగిల్ విండో చైర్మన్ దీటి రాజిరెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మ, ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

జగిత్యాల: సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 102 మంది లబ్ధిదారులకు రూ.28.25 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు జ్యోతి, నాగభూషణం, శ్రీనివాస్, దామోదర్‌రావు పాల్గొన్నారు.



ఉప్పుమడుగులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పట్టణాభివృద్ధికి సహకరించండి

జగిత్యాల పట్టణాభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే అన్నారు. గోవిందుపల్లిలో ఈజీఎస్ నిధులు రూ.35 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. గోవిందుపల్లి వాగుపై రూ.4.5 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మోతె చెరువుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాల్సిందే..

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

జగిత్యాలటౌన్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాల్సిందేనని, లేకుంటే బీఆర్ఎస్ గతే పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా నుంచి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి నాయక్ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప బీజేపీ చేసిందేమీలేదన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. కులగణనకు బీజేపీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఎంపీగా అర్వింద్ జగిత్యాల జిల్లా అభివృద్ధికి నయాపైసా ఖర్చు చేయలేదన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, తప్పెట్ల స్కైలాబ్‌బాబు, జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు ఇందూరి సులోచన, కోమటి చంద్రశేఖర్, ఎంఏ చౌదరి, మహిపాల్‌నాయక్ వినోద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మూడు గ్రామాలకో విద్యుత్ సబ్ స్టేషన్

- వినియోగదారుల విద్యుత్ కష్టాలకు చెక్
- లో–వోల్టేజీ లేకుండా విద్యుత్‌శాఖ ఏర్పాట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయం, గృహ, పరిశ్రమల అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు విద్యుత్ లాస్‌ను వీలైనంత మేరకు తగ్గించడమే లక్ష్యంగా విద్యుత్‌శాఖ ముందుకెళ్తోంది. విద్యుత్ సరఫరాలో ఎప్పటికప్పుడు నష్టాన్ని నివారించడం, ఓవర్ లోడ్‌ను తగ్గించడం, లో– వోల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మూడు గ్రామాలకో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసింది.

జిల్లాలో 117 విద్యుత్ సబ్ స్టేషన్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విద్యుత్ శాఖ ఎక్కడికక్కడే విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తోంది. ఒక్కో సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1.50 కోట్ల నుంచి రూ.1.75 కోట్ల వరకు వెచ్చిస్తోంది. ప్రస్తుతం గృహాలు, పరిశ్రమలు, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో పంపిణీలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటోంది. విద్యుత్ సరఫరాలో సబ్‌స్టేషన్‌లే కీలకం కావడంతో వాటి నిర్మాణానికి నిర్ణయించింది. జిల్లాలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 117 పనిచేస్తున్నాయి. ప్రస్తుతం జగిత్యాల అర్బన్ మండలంలో 7, జగిత్యాల రూరల్‌లో 7, రాయికల్‌లో 6, సారంగాపూర్‌లో 3, బీర్‌పూర్‌లో 3, ధర్మపురిలో 4, బుగ్గారంలో 3, వెల్గటూర్‌లో 4, ఎండపల్లిలో 4, పెగడపల్లిలో 6, గొల్లపల్లిలో 5, మల్యాలలో 7, కొడిమ్యాలలో 5, కోరుట్లలో 11, మెట్‌పల్లిలో 10, ఇబ్రహీంపట్నంలో 8, మల్లాపూర్‌లో 8, కథలాపూర్‌లో 7, మేడిపల్లిలో 3, భీమారంలో 6 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలో దాదాపు 360 గ్రామాల వరకు ఉన్నాయి. దాదాపు మూడు గ్రామాలకో విద్యుత్ సబ్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి.

ఎనిమిది 132/33 కేవీ సబ్‌స్టేషన్లు

జిల్లాలో ఎనిమిది 132/33 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. జిల్లాకేంద్రంతో పాటు ధర్మపురి, రాయికల్, కోరుట్ల, కథలాపూర్ మండలకేంద్రాలతో పాటు, కొడిమ్యాల మండలం పూడూరు, మెట్‌పల్లి మండలం గోధూర్, వెల్గటూర్ మండలం ఎండపల్లిలో ఉన్నాయి. సారంగాపూర్ మండలంలోని పెంబట్ల–కోనాపూర్‌లో 220/132 కేవీ సబ్‌స్టేషన్ ఉంది.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఇంటి వరకు..

మొదట జిల్లాలోని పెంబట్ల–కోనాపూర్‌లో గల 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రామగుండం థర్మల్ స్టేషన్ నుంచి.. అక్కడి నుంచి జిల్లాలోని ఎనిమిది 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు.. అక్కడి నుంచి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల కింద 11 కేవీ లైన్స్‌కు సంబంధించి 520 ఫీడర్లు ఉంటాయి. ఈ ఫీడర్ల ద్వారా గ్రామాల్లోని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు చేరుతుంది. ఇలాంటివి జిల్లాలో 22,884 వరకు ఉంటాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ల కింద 41 వేల ఎల్‌టీ ఫీడర్‌లు ఉంటాయి. ఇక్కడి నుంచి గృహాలు, వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇలా నిత్యం జిల్లాలో 4 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

సబ్‌స్టేషన్ల పరిశీలనకు 255 మంది

విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాను చూసేందుకు 255 మంది పనిచేస్తున్నారు. ఇందులో 225 మంది ఆపరేటర్లు, 30 మంది వాచ్‌మెన్‌లు. వీరితోపాటు ఎప్పటికప్పుడు విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన ఎస్ఈ, డీఈ, ఏడీ, ఏఈ, లైన్‌మన్, హెల్పర్లు కూడా పరిశీలిస్తుంటారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు అత్యధిక సంఖ్యలో ఏర్పాటు కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం లేదు.



జగిత్యాల అర్బన్ మండలంలోని మోతెలో పూర్తయిన విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రస్తుతం ఇబ్బంది లేదు



ప్రస్తుతం విద్యుత్ సరఫరా లో ఇబ్బంది లేదు. నాణ్యమైన కరెంట్ వస్తోంది. లో–వోల్టేజీ సమస్యతో విద్యుత్ మోటర్లు కాలిపోతాయనే బాధ కూడా లేదు. ఏదైనా సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు కొంత ఇబ్బంది ఎదురవుతున్నా.. ఒక్కరోజులోనే మరో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్నారు.

– నక్కల తిరుపతిరెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి(మం)

నాణ్యమైన 24 గంటల విద్యుత్



నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అవసరమైనన్ని సబ్‌స్టేషన్లు నిర్మించాం. విద్యుత్ నష్టాలను వీలైనంత వరకు తగ్గించి.. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నాం.

– సాలియా నాయక్, ఎస్ఈ

శరణు శరణు రాజన్న


రాజన్న ఆలయంలో భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి 40 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు. శివకల్యాణోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేశారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్ పరిశీలించారు.

నమో నర్సన్న


గోదావరిలో పుణ్యస్నానం


శ్రీవేంకటేశ్వరస్వామికి తెప్పోత్సవం


తలనీలాల సమర్పణ


నృసింహుని దక్షిణ దిగ్యాత్ర


కోడెమొక్కు..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గోదావరిలో స్నానాలు ఆచరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి తలనీలాలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరస్వామికి తెప్పోత్సవం, డోలోత్సవం, నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్రను వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా డీజే సౌండ్స్, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలతో శోభాయాత్రగా తీసుకెళ్లారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ చైర్మన్ రవీందర్, ఈవో శ్రీనివాస్, డీఎస్పీ రఘుచందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాఘవాచారి (ఫైల్)

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన గోగులకొండ రాఘవాచారి (54) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ అనూష కథనం ప్రకారం.. రాఘవాచారి ఈ నెల 5న ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్యం మెరుగైందని ఇంటికి తీసుకురాగా ఇటీవల మళ్లీ క్షీణించింది. కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రూ.20 లక్షల వరకు అప్పు చేసి ఇంటి నిర్మాణం చేయగా, అప్పులు పెరిగి, తన వెల్డింగ్ షాపు సరిగా నడవకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య తార ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

విషజ్వరంతో మహిళ..


ఆసియాబేగం (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఆసియా బేగం (40) విషజ్వరంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నాలుగురోజుల క్రితం ఆసియాబేగంకు జ్వరం రావడంతో జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి శనివారం కరీంనగర్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. జ్వరంతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, డెంగీ లక్షణాలు కూడా కనిపించినట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన జిలకర రామస్వామి కూడా విషజ్వరంతో చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏమైందో ఏమో..?

- మిస్టరీగా ప్రేమజంట ఆత్మహత్య


రాహుల్ (ఫైల్)


శ్వేత (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): పరిపక్వతలేని ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణం తీసింది. ఇరు కుటుంబాల్లో ఎలాంటి నిర్బంధాలు లేవని, వారి ఫిర్యాదులతో తెలుస్తోంది. అయినా ఎందుకు ప్రాణాలు తీసుకున్నారో తేలాల్సి ఉందనే సందేహం కలుగుతోంది. జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్, పాపయ్యపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శనివారం రాత్రి యువతి, యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మంచిర్యాల రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపిన వివరాలు.. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మెనుగు రాహుల్ (18)కు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఏరుచింతల గ్రామానికి చెందిన గోలేటి శ్వేత(20)తో పరిచయం ఏర్పడింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన రాహుల్ హైదరాబాద్‌లో ఎల్ఈడీ బల్బ్స్ ఈవెంట్ వర్క్స్ చేస్తుంటాడు. ఇంటర్ సప్లిమెంటరీ ఎగ్జామ్ రాసి ఇంటికి వద్ద ఉంటున్నాడు. శ్వేత కరీంనగర్‌లోని ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శివరాత్రి పండుగకు ఇంటికి వెళ్లిన శ్వేత ఇటీవల కరీంనగర్ కళాశాలకు వచ్చింది. కాగా శనివారం రాత్రి ఇద్దరూ జమ్మికుంట మండలం పాపయ్యపల్లి శివారులోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధపడ్డారు. గూడ్స్ డ్రైవర్ హారన్ మోగించినా పట్టాల పైనుంచి జరగకుండా ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వీరి మధ్య ప్రేమ ఎక్కడ, ఎలా చిగురించిందో తెలియదుగానీ, ఇద్దరూ ఏ నిర్బంధాలు లేకుండానే సున్నిత మనస్తత్వంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ వ్యవహారం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని రాహుల్ తండ్రి రాజు ఫిర్యాదు ఇవ్వగా.. ఏ కారణంతో చనిపోయిందో తెలియదని మృతురాలి తండ్రి రాజలింగు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఏదిఏమైనా ఇద్దరి ఆత్మహత్య ఘటన కారణాలు లేకుండా మిస్టరీగా మారింది. ఇద్దరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఈ ఆత్మహత్యలపై రైల్వే పోలీస్ విచారణలో తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి ఆదివారం తెలిపారు.

కూల్ డ్రింక్ అనుకుని పురుగుల మందు తాగి..

- చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి
- 25 రోజుల క్రితమే కుమారుడు ఆత్మహత్య


బాలవ్వ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): కూల్ డ్రింక్ అనుకుని పురుగుల మందు తాగిన వృద్ధురాలు చికిత్సపొందుతూ మృతిచెందింది. ఎస్సై గణేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన జెల్ల బాలవ్వ(74) శనివారం ఇంట్లో కూల్‌డ్రింక్ అనుకొని సీసాలోని పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు బాలవ్వను ముస్తాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందింది. అయితే వరిపంటకు కొట్టగా మిగిలిన పురుగుల మందును కూల్ డ్రింక్ సీసాలో ఉంచారు. ఇది తెలియని బాలవ్వ కూల్ డ్రింక్ అనుకుని పురుగుల మందు తాగి మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా 25 రోజుల క్రితమే అప్పుల బాధలు భరించలేక బాలవ్వ కుమారుడు దేవయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 25 రోజుల వ్యవధిలో ఒకే ఇంట్లో ఇద్దరూ మరణించడంతో పోతుగల్‌లో విషాదం నెలకొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

నిన్న హత్య.. నేడు అంత్యక్రియలు

- మానవత్వం చాటిన పోలీసులు
- కుటుంబ సమక్షంలో కమలాకర్ దహనసంస్కారాలు


చితిపై కమలాకర్ మృతదేహం


రోదిస్తున్న బంధువులు

జగిత్యాలక్రైం: క్షణికావేశంలో ఇంటిపెద్దను భార్య, కొడుకులు, కూతురు, అల్లుడు హత్య చేశారు. క్షణికావేశం నుంచి తేరుకున్నాక తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకులు, కూతురు కన్నీరుమున్నీరయ్యారు. స్థానికుల వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల కమలాకర్ (58)పై మొదటి భార్య జమున, పెద్ద కొడుకు చిరంజీవి, చిన్న కొడుకు రంజిత్, కూతురు శిరీష, అల్లుడు శోభన్ కలిసి క్షణికావేశంలో పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో చికిత్స పొందుతూ కమలాకర్ మృతిచెందగా అతడి బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని చూసేందుకు కూడా ఎవరూ రాలేదు. దీంతో ఆదివారం కొంత మంది సన్నిహితుల మధ్య పోలీసులు పోస్టుమార్టం పూర్తి చేయించి మృతదేహాన్ని పొలాసకు తరలించారు. దీంతో హత్యలో ప్రమేయం ఉన్న వారంతా పోలీస్‌స్టేషన్‌లో ఉండటంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మానవత్వం చాటిన పోలీసులు ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య మొదటి భార్య జమున, కొడుకులు చిరంజీవి, రంజిత్, కుమార్తె శిరీష, అల్లుడు శోభన్‌ను పొలాసకు తీసుకెళ్లారు. దీంతో వారంతా కమలాకర్ మృతదేహంపై పడి రోదించడంతో స్థానికులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి చితికి నిప్పంటించాడు. అంత్యక్రియల అనంతరం నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

మృతుడి ఇంట్లో ఆయుధాలు

కుటుంబ సభ్యుల చేతిలో హత్యకు గురైన పడాల కమలాకర్ ఇంట్లో ఆదివారం పోలీసులు పరిశీలించగా భారీ ఆయుధాలు లభ్యమయ్యాయి. తల్వార్లతో పాటు కత్తులు, రాడ్లు కన్పించడంతో పోలీసులు బిత్తరపోయారు. కమలాకర్ పక్కా ప్రణాళికతోనే కొన్నేళ్లుగా మారణాయుధాలు వెంట ఉంచుకుంటూ తిరిగాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

నిందితుల రిమాండ్

జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల కమలాకర్ (58)పై పెట్రోల్ పోసి నిప్పంటించి మృతికి కారణమైన ఐదుగురిని ఆది వారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలి పారు. కుటుంబ కలహాలతో మొదటి భార్య జమున, పెద్ద కొడుకు చిరంజీవి, చిన్న కొడుకు రంజిత్, కుమార్తె శిరిష, అల్లుడు శోభన్‌బాబు కలిసి కమలాకర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందగా అతడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదయింది. సమావేశంలో రూరల్ ఎస్సై సధాకర్ పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడు మృతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని రొంపికుంట గ్రామ శివారులోగల వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతిచెందాడు. కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలు.. సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన నముళ్ల లక్ష్మయ్య (75) పదిహేను రోజు క్రితం రొంపికుంటలోని తన కూతురు ఇంటికి వచ్చి ఉంటున్నాడు. గత మంగళవారం ఇంటినుంచి బయటికి వెళ్లిన లక్ష్మయ్య ఇంటికి రాకపోవడంతో రెండురోజుల క్రితం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. కాగా, లక్ష్మయ్య భార్య రెండునెలల క్రితం చనిపోవడంతో అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేకుండా తిరుగుతున్నాడని, ఈ క్రమంలో బావిలో పడి మృతిచెందాడని మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీబీ ముక్త్ దిశగా అడుగులు

- జగిత్యాల జిల్లాలో 16 గ్రామాలు టీబీ ముక్త్ పంచాయతీలుగా ప్రతిపాదన


పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మల్యాల(చొప్పదండి): క్షయ నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. టీబీ లక్షణాలు ఒక్కరికి కూడా లేని జగిత్యాల జిల్లాలోని వివిధ మండలాల్లో 16 గ్రామాలను ఎంపిక చేసి, కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. క్షయ ఏ స్థాయిలో ఉందో తెలుసుకొని, ఆ మేరకు మందులు పంపిణీ చేస్తుండడంతో టీబీ తగ్గుముఖం పడుతోంది. టీబీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకునేందుకు ఆర్థికసాయం అందిస్తూ, క్షయ రహిత సమాజ నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి.

టీబీ ముక్త్ పంచాయతీలుగా 16 గ్రామాలు

జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా వ్యాధి నిర్ధారణ శిబిరాలు నిర్వహించారు. టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపిక చేసేందుకు గ్రామ జనాభా ప్రాతిపదికన ప్రతీ వెయ్యి మందికి ఒకటి లేదా 0 టీబీ కేసు నమోదు కావడంతోపాటు, ఒక్కో గ్రామంలో 30మందికిపైగా టీబీనాట్ పరీక్షలు చేయడం, గతంలో ఉన్న వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేసిన 16 గ్రామాలను టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపిక చేశారు. వీటిలో మానాల, గొర్రెగుండం, హిమ్మత్‌రావుపేట, కన్నాపూర్, హుస్సేన్‌నగర్, చెప్యలమద్ది, ధర్మారం, మూలరాంపూర్, ఆక్సాయ్‌పల్లి, బూర్గుపల్లి, రాజారాంపల్లి, కిచులాటపల్లి, ఊట్‌పల్లి, గుమ్లాపూర్, రామరావుపల్లి, రాజారం తండా ఉన్నాయి.

జిల్లాలో 1,930 మంది..

జగిత్యాల జిల్లాలో టీబీ బారిన పడిన రోగులు ఉండగా, క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాధి నుంచి బయటపడుతున్నారు. బాధితులు పౌష్టికాహారం తీసుకునేందుకు ప్రతి నెలా రూ.500, ఉచితంగా మందులు అందిస్తూ వ్యాధిని నియంత్రణలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు.

క్షయ సోకినవారిలో కన్పించే లక్షణాలు

క్షయ సోకినవారిలో ప్రధానంగా తీవ్రమైన జ్వరం వారాల తరబడి తగ్గకపోవడం, ఆకలి మందగించడం, హఠాత్తుగా బరువు తగ్గడం, రోగనిరోధకశక్తి తగ్గిపోవడం, రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడడం, తీవ్రమైన తలనొప్పి రావడం లక్షణాలను క్షయగా నిర్ధారించారు. ఈ వ్యాధి బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, ఇది ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. దగ్గు, తుమ్మడం, ఉమ్మివేయడం ద్వారా బ్యాక్టీరియా గాలిలో కలిసి, ఆరోగ్యవంతులు సైతం క్షయ బారిన పడే ప్రమాదం ఉంది.

సీబీనాట్ యంత్రంతో నిర్ధారణ..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సీబీనాట్ యంత్రంతో టీబీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడంతోపాటు, రోగి మందుల వాడక సామర్థ్యాన్ని తెలుసుకోవచ్చు. ఈ యంత్రంతో రెండు గంటల్లో టీబీ పరీక్ష ఫలితం నిర్ధారించవచ్చు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించడంతోపాటు మందులకు తగ్గే అవకాశం ఉందా లేదా అని తెలుసుకోవచ్చు. టీబీ లక్షణాలున్న వారి నుంచి ఆశ కార్యకర్తలు తెమడ సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

టీబీ నివారణకు కృషి చేస్తున్నం



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సీబీనాట్ యంత్రంతో క్షయ వ్యాధి స్థాయిని నిర్ధారించి, ఆ మేరకు మందులు పంపిణీ చేయడంతో జిల్లాలో టీబీ తగ్గుముఖం పట్టింది. గతంలో ఏడాదికి 80 మంది మొండి క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించగా, ప్రస్తుతం ఏటా 30మందికి తగ్గింది. ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, టీబీ నివారణ దిశగా కృషి చేస్తున్నాం – ఎస్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి, జగిత్యాల

వృద్ధురాలి దారుణహత్య


వెంకటమ్మ (ఫైల్)

కొత్తపల్లి(కరీంనగర్): వృద్ధురాలి గొంతుకోసి హత్యచేసిన ఘటన కొత్తపల్లి (హెచ్) ఎస్సారెస్పీ కెనాల్ వద్ద జరిగింది. ప్రయాణికులు, స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్, ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధరయాదవ్, కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. మృతురాలు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన తనుకు వెంకటమ్మ (70)గా గుర్తించారు. అయితే హత్యకు గల కారణాలు, హత్య చేసింది ఎవరు.. కొత్తపల్లి కెనాల్ వద్దే చంపేసారా..ఇతర ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ వదిలేసారా..? అన్న విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కాగా కోహెడ మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన మృతురాలి పెద్ద కుమార్తె లక్ష్మీ సమాచారం తెలియగానే ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుంది. అయితే డబ్బుల విషయంలోనే వృద్ధురాలిని కుటుంబ సభ్యులే హత్య చేసినట్లు పుకార్లు షికార్లు కొడుతున్నాయి. హత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలనున్నాయి.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌కు చెందిన గంపల సంపత్ (38)కు భార్య, కూతురు, కొడుకు ఉండగా కుటుంబ సమస్యల కారణంగా భార్యతో విడాకులయ్యాయి. పిల్లలకు దూరంగా ఉండడంతోపాటు ఒంటరితనం భరించలేక మనోవేదనకు గురవుతున్న సంపత్ తన తండ్రి గంపల సాయిలు వద్ద ఉంటున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్డియాలజిస్టు అనీశ్ పబ్బ

కరీంనగర్‌టౌన్: గుండె జబ్బులు ఎవరికైనా వచ్చే అవకాశం ఉందని, కేవలం నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారని మెడికవర్ కార్డియాలజిస్టు డాక్టర్ అనీశ్ పబ్బ అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండె జబ్బులు.. చికిత్స..అంశంపై అవగాహన కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు వాకర్స్ సందేహాలకు సమాధానాలు తెలిపారు. ఈ సందర్భంగా అనీశ్ మాట్లాడుతూ, రోజూ వాకింగ్, వ్యాయామం చేస్తున్నామని భరోసాగా ఉండే పరిస్థితి లేదన్నారు. ధూమపానం, మద్యపానం, ఫాస్ట్‌ఫుడ్, నాన్‌వెజ్ తీసుకోవడం, అధిక బీపీ, షుగర్ ఉన్న 35 ఏళ్ల పైబడినవారు రిస్క్‌లో ఉన్నట్లేనని పేర్కొన్నారు. రిస్క్ తప్పించుకోవాలంటే లైఫ్‌స్టైల్ మార్చుకొని, ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. ఏడాదికోసారి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు నాగరాజు, వినయ్, విష్ణువర్ధన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఖాజామొయినొద్దీన్, రుత్విక్, రవిమల్లారెడ్డి, కోటకర్ణాకర్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం


దేవక్క (ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన పూదరి దేవక్క (70) మృతదేహం మల్యాల మండలం మానాల శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో లభ్యమైంది. శుక్రవారం దేవక్క మేడిపెల్లి మండలం వల్లంపెల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. దేవక్క బంధువులు, పోలీసులు కెనాల్ వెంట గాలించగా ఆదివారం ఉదయం మృతదేహాన్ని మానాల శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తించి కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవక్కకు మతిస్థిమితం సరిగా లేదని ఆమె భర్త పూదరి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరినదిలో..

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ సమీప గోదావరినదిలో ఆదివారం ఓ వ్యక్తి(సుమారు 40 ఏళ్ల పురుషుడు) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి మంచిర్యాల లేదా నస్పూర్ ప్రాంతానికి చెందినవాడుగా భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మార్చురీలో భద్రపరిచారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే సెల్ నంబరు 8712656527కు సమాచారం అందించాలని ఎస్సై వెంకటస్వామి కోరారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రేపాక గ్రామంలో శనివారం రాత్రి ఎల్లమ్మ ఆలయంలోని హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. మూడేళ్ల క్రితం ఎల్లమ్మ గుడిలో హుండీని ఎత్తుకెళ్లి చెరువులో పారేశారు. మళ్లీ చోరీ జరగడంపై గౌడ సంఘ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్‌లో బంగారు గొలుసు..

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని బస్టాండ్‌లో బంగారు గొలుసు చోరీపై ఆదివారం కేసు నమోదైంది. వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. ఈనెల 12న బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో దొంగలు తన మెడలోని రెండుతులాల బంగారు గొలుసు కొట్టేసినట్లు మంచిర్యాల జిల్లా సీతారాంపూర్ గ్రామానికి చెందిన సంతుకుమార్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీలో టీ–2 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న సింగరేణి కార్మికుడు బొట్ల రాములు క్వార్టర్‌లో ఆదివారం చోరీ జరిగింది. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మూడురోజుల క్రితం రాములు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లారు. ఆదివారం ఇంటికి రాగా, తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాలో 15 తులాల వెండి, రూ.40వేల నగదు చోరీకి గురైంది. బాధితుడి కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.